●ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ గన్నవరం నియోజకవర్గ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, నాయకుడు కోనేరు సుబ్బారావు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్ వీరిని ఆప్యాయంగా పలకరించి నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. -రామవరప్పాడు

క్లుప్తంగా

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు



పెనమలూరు: యనమలకుదురు కొండ వెనుక ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాన్ని ఆగమేఘాలపై ప్రతిష్టించారు. గతంలో ఇక్కడ విగ్రహాలపై వివాదం ఏర్పడటంతో ఒక వర్గానికి చెందిన వారు గౌతులచ్చన్న విగ్రహం ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గతంలో కొండ వెనుక ప్రాంతంలో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలని స్థలం ఎంపిక చేశారు. అయితే అదే ప్రాంతంలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆయన అభిమానులు పెట్టడంతో వివాద పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా రంగా విగ్రహం పక్కనే గౌతులచ్చన్న విగ్రహాన్ని ఇప్పుడు ఏర్పాటు చేశారు. గ్రామంలో విగ్రహాల ఏర్పాటు చర్చనీయంగా మారింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు మురళీనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్, జై జవాన్ స్ట్రీట్, శరవణ్ హోటల్ ప్రాంతం, కొడాలివారి వీధి, బల్లెంవారి వీధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలకు గన్నవరం ప్రాంతంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. దేవస్థానాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయం, శ్రీగాయత్రి మందిరం, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీభువనేశ్వరీ పీఠం, శ్రీకనకదుర్గమ్మ, శ్రీపెద్దమ్మతల్లి ఆలయాలతోపాటు బుద్దవరం, కేసరపల్లిలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారు పలు అలంకరణలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

జాతిపితను మరిచారు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ అధికారులు సాక్షాత్తు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి కనీస గౌరవం ఇవ్వలేదు. గాంధీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని శుభ్రపరిచి పూల దండ కూడా వేయలేదు. యనమలకుదురు సచివాలయం -1 ప్రాంగణంలో గాంధీ విగ్రహం చాలా సంవత్సరాలుగా ఉంది. గాంధీ జయంతిన ప్రతీ సంవత్సరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. అయితే బుధవారం జరిగిన గాంధీ జయంతి సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు విగ్రహానికి కనీస గౌరవం ఇవ్వకుండా వదిలేశారు. విగ్రహానికి పూలమాల కూడా వేయలేదు.

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

పెనమలూరు: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వివరాలు తెలుపుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి రూ.25 వేల కోట్లు ఉందన్నారు. దసరా సెలవుల నాటికి ప్రభుత్వం ఉద్యోగుల బకాయి చెల్లించాలని కోరారు. డీఏ, సరెండర్ లీవ్, పెండింగ్‌లో ఉన్న బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు.

సోదర భావంతో మెలగాలి

కంకిపాడు: అందరూ సోదరభావంతో మెలగాలని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. మండలంలోని కోలవెన్ను శివారు మాదాసువారిపాలెంలో నూతనంగా నిర్మించిన బెరియన్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరం ప్రారంభోత్సవంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలన్నారు. ఈర్షా ద్వేషాలు విడనాడి, ప్రేమ, శాంతి మార్గాల్లో సాగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం ఆదర్శప్రాయం

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్ర పటం వద్ద నివాళు లర్పిస్తున్న సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు



ఉయ్యూరులో మహాత్మా విగ్రహానికి పూలమాల వేస్తున్న లయన్స్ ప్రతినిధులు



పోరంకి మున్సిపాలిటీ వద్ద పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్



ఎనికేపాడులో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రిలకు నివాళి

కంకిపాడు: జాతిపిత మహాత్మా గాంధీజీ జీవితం ఆదర్శప్రాయమని కంకిపాడు డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. గాంధీజీ జయంతి వేడుకలు కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గాంధీజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన బాటలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఉయ్యూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ ఆశయాలు, సిద్ధాంతాలను అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కేబినెట్ డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు, అధ్యక్షుడు నేరెళ్ల తేజ, జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్, జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, పాగిరి రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉయ్యూరు మున్సిపాలిటీ, మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించి, గ్రామసభలు నిర్వహించారు.

పెనమలూరు: మహాత్మా గాంధీ జయంతిని మండల పరిధిలో బుధవారం ఘనంగా చేశారు. పోరంకిలో వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కాగా వరదల సమయంలో ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, పీతా గోపీచంద్, సంగెపు రంగారావు పాల్గొన్నారు.



గన్నవరంలో పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మహాత్మా చిత్రపటానికి వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీఓ ఇ. సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానించారు. ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, పంచాయితీరాజ్ ఏఈ టి. దాసు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ నిర్వహించారు. ఎమ్మార్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ, ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి కాలనీలోని రోడ్లను శుభ్రం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మహాత్ముని విగ్రహానికి టీడీపీ నేతలు దొంతు చిన్నా, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, టి. శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. 21 గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలు నిర్వహించారు. గోపవరపుగూడెం గ్రామంలో సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు, తెంపల్లిలో సర్పంచ్ కొలుసు శిరీషా బాపూజీకి నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: గాంధీజీ జయంతి వేడుకలను హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయం ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పలువురు సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శేషా చలపతి గాంధీకి నివాళి అర్పించారు. హనుమాన్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద స్థానికులు జయంతి వేడుకలు నిర్వహించారు. జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, నండూరి సత్య వెంకటేశ్వరశర్మ, వార్డు సభ్యుడు తాడిశెట్టి శ్రీను, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ బుద్ధుడు, కోళపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎనికేపాడులో నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం 80శాతం పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



రామవరప్పాడు: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎనికేపాడులో బుధవారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు ఆధ్వర్యాన పారిశుద్ధ్య సిబ్బంది, పేదలకు దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తొలుత గాంధీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాటసారులకు పండ్లు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పురిమి సుబ్రహ్మణ్యం, సెక్రటరీ కే ఆనందరావు, విశ్రాంత హెచ్ఎం వీ సుధాకరరావు, జే నాగేశ్వరరావు, చిన్నం కనకయ్య, సుగల ప్రసాద్, చిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఉత్తమ వైద్యసేవలు అందించాలి

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి



ఉయ్యూరులో హోప్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

ఉయ్యూరు: గ్రామీణులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. ఉయ్యూరులో నూతనంగా నిర్మించిన హోప్ ఆసుపత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఆర్థోపెడిక్ వైద్య సేవలతోపాటు అన్ని రకాల వైద్య సేవలు కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో ఉయ్యూరులో అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విజయవాడకు వెళ్తున్నారన్నారు. డాక్టర్ జాన్ డేవిడ్ కార్పొరేట్ తరహా వైద్య సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. పెనమలూరు, గన్నవరం ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్‌జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం



ఖైదీలకు పండ్లు పంపిణీ చేస్తున్న కేవీ రమణ

గన్నవరం: స్థానిక సబ్‌జైలులో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కలపాల వెంకటరమణ రిమాండ్ ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఖైదీలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని చెప్పారు. క్షణికావేశంలో చేసిన నేరాల వల్ల జైలు జీవితం గడపాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. ఇకపై నేర ప్రవృతిని విడనాడి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారాలని సూచించారు. జైలు సూపరిండిండెంట్ భారతి రాంబాబు, న్యాయవాది నల్లమోతు రమేష్, పలువురు జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి శస్త్రచికిత్సకు బుధవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేసింది. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన మందారపు రమేష్‌కుమార్, రాజేశ్వరి దంపతుల కుమార్తె అంకిత (8) చిన్న వయస్సులోనే వెన్నుపూస సమస్యతో బాధపడుతోంది. ఏటా క్రమం తప్పకుండా వెన్నుపూస శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉందని డాక్టర్లు చెప్పారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవించే రమేష్ దంపతులకు వైద్య ఖర్చులు భరించే స్తోమత లేదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు గతేడాది మానవత సంస్థను ఆశ్రయించారు. గత సంవత్సరం కూడా రూ. 47 వేలు అందజేశారు. ఈ ఏడాది కూడా వైద్యానికి అయ్యే ఖర్చు రూ. 50 వేలును స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో అందించారు. సంస్థ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జయరామచంద్రరావు, కార్యదర్శి పాబోలు గణేష్, సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామచంద్రరావు, కూరెళ్ల సుబ్బాచారి, దయాల ప్రభాకరరావు, శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం గ్రామాల్లో వరద బాధితులకు శ్రీసత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో బుధవారం రెండు దిండ్లు, దుప్పట్లు, చాప పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఇళ్లు ముంపునకు గురికావడంతో నష్టపోయిన 370 కుటుంబాలకు రూ. 2.50 లక్షల విలువ చేసే సామగ్రిని అందజేశారు. శ్రీసత్యసాయి సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ కొమరగిరి శ్యామ్‌ప్రసాద్ , జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, బాపులపాడు మండల కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బైబిల్ క్విజ్ పోటీలు



ఉయ్యూరు: పట్టణంలోని హెబ్రోను ప్రార్థనా మందిరంలో యూత్ రిట్రీట్-2024 కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. యూత్ రిట్రీట్‌లో ముఖ్యఅతిథులుగా ఎం.అనిల్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ జ్యోతి సందేశాలిచ్చారు. బంగారు వాక్యంలో ఆర్.సుసన్నా నేషనల్ బాప్టిస్ట్ చర్చి కొవ్వూరు నుంచి బంగారు ఉంగరాన్ని గెలుచుకుంది. ముఖ్యఅతిథి జీవమణి బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందించారు.

కేబుల్ వైర్ల ధ్వంసంపై కేసు

పెనమలూరు: కేబుల్ వైర్ల ధ్వంసంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. పోరంకి గ్రామంలో కొండేటి గంగాధరరావు కుటుంబ సభ్యులతో నివశిస్తున్నాడు. అతను వి-డిజిటల్ నెట్‌వర్కు నిర్వహిస్తున్నాడు. కాగా అతను కేబుల్ వైర్లు వేసి వాటికి కేబుల్ బాక్సులు ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలో జల్సా బ్లాక్ సమీపంలో కేబుల్ వైర్లు, బాక్సులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోటీ కేబుల్ ఆపరేటర్లు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఉపాధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలి

పెనమలూరు: ఉపాధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని మండల పరిషత్ పరిపాలన అధికారి లోయ శివశంకర్‌రావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గోసాల, పెనమలూరులో జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిపనులు చేపట్టడానికి ముందుగా పనులు గుర్తించాలన్నారు. అంచనాలు వేసి పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా గ్రామ పంచాయతీ పాలకులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లింగాల భాస్కరరావు, సంగెపు శ్రీనివాసరావు, అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం



నున్నలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న డీపీఓ శివప్రసాద్‌యాదవ్, సర్పంచ్ సరళ

నున్న(విజయవాడరూరల్): స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి ఎస్వీ శివప్రసాద్ యాదవ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం నున్న గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో డీపీఓ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం పట్ల మహిళలకు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చెత్తనుంచి సంపద సృష్టించే విధంగా పని చేయాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు కష్టపడి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రశంసించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఉపాధి నిధులు రూ. 25 లక్షలు స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ద్వారా వచ్చాయని వాటితో బీసీ ఏరియాలో రెండు సిమెంటు రోడ్లు నిర్మించుకునేందుకు తీర్మానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కాటూరి సరళ, పంచాయతీ వార్డు సభ్యులు గంపా శ్రీనివాసరావు, షేక్ సైదాబీ, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కానూరులో స్వచ్ఛతా హీ సేవ



కానూరు చెరువు వద్ద స్వచ్ఛతాహీ సేవలో విద్యార్థులు

పెనమలూరు: కానూరు చెరువు వద్ద వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని శుభ్రపరిచారు. అమృత్ సరోవర్‌లో భాగంగా గ్రామంలో చెరువు పరిసరాలు శుభ్రం చేశారు. అలాగే విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి డివైడర్ మధ్యలో పిచ్చి మొక్కలు తొలగించారు. తమ కాలేజీ విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొని సేవలు అందిస్తున్నారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర తెలిపారు.

కూటమి నేతల ఆత్మీయ సమావేశం



పోరంకిలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

పెనమలూరు: పోరంకిలో పెనమలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ కూటమి నేతల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఆత్మీయ సమావేశంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, తాను, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గెలిచామంటే అది కూటమి శ్రేణుల కృషేనన్నారు. భవిష్యత్తులో కూడా అందరూ కలిసి పని చేయాలని కోరారు. పెనమలూరు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తీసుకువస్తానని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఉపాధి, వ్యాపారాలకు ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, షేక్ బుజ్జి, పలువురు నేతలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

జాస్తి రత్నకుమారి W/o రాజేంద్రప్రసాద్, డోర్.నెం. 05-99, ఫ్లాట్ నెం. 104, వెంకట్రామ్ గార్డెన్స్, శివాలయం స్ట్రీట్, పోరంకి, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా, నా పేరుతో కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రి.నెం. 7378/2019 లింక్ డాక్యుమెంట్ నెం. 725/1963గల ఒరిజినల్ దస్తావేజు పోరంకి సెంటర్‌లో పోయినది. దొరికినవారు అందజేయ ప్రార్థన

జాస్తి రత్నకుమారి

సెల్ : 99498 67966

అక్రమ కేసులు అప్రజాస్వామికం

ఉయ్యూరు: బీఎస్పీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెగ్గెం ప్రసాద్‌రావు అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై చేస్తున్న దాడులను నిరసిస్తూ మదనపల్లెలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్ నేతృత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న నాయకులపై పోలీసులు జులుం ప్రదర్శించారని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత వైద్యుడిపై దౌర్జన్యం చేసిన కాకినాడ ఎమ్మెల్యే నానాజీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలన దాడులు, అరాచకాలేనని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని స్పష్టంచేశారు.

ముగిసిన అథ్లెటిక్స్ మీట్

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ మీట్ బుధవారం ముగిసింది. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చాటిన పలువురు క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. విజేతలు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి రమణ, ప్రతినిధులు హరగోపాల్ తెలిపారు.